www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 69 | | 21-8-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## కాంగ్రెస్ ఓ కొత్త 'ముస్లిం లీగ్'



- వందేమాతరాన్ని అవమానించడం దారుణం
- ఓటు బ్యాంకు కోసమే దేశ ఆత్మగౌరవం తాకట్టు
- కాంగ్రెస్ తీరుపై బీజేపీ నేత నితిన్ నబీన్ ఫైర్
- తొలి రెండు చరణాలే పాడాలన్న నిర్ణయంపై ఆగ్రహం

4



## 40 ఏళ్లకే దేశ ప్రధాని!

రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి

మాజీ ప్రధానిని స్మరించుకున్న నరేంద్ర మోదీ

4

పెంపుడు జంతువులకున్న వసతులు

## బడుల్లో లేవా!

- మహారాష్ట్ర పాఠశాలల్లో అధ్వాన పరిస్థితులు
- విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- నాయకుల తీరుపై మండిపడ్డ అభిజీత్ దిప్కే

4



# 22ఏ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



- కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- రైతుల భూ భద్రతకే 'భూ భారతి'
- నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు
- అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

### ప్రతి ఫిర్యాదుపై చివరి వరకు పర్యవేక్షణ

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని, కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును ఒక బాధ్యతగా తీసుకుని సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 22ఏ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, వచ్చిన కాల్స్‌కు అందిస్తున్న సమాచారం తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, ఈ నాలుగు జిల్లాల దరఖాస్తుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

- హైదరాబాద్, ఆగస్టు 20

మిగతా 2 లో



సమస్యలు తేల్చడమే అసలైన

## సమాఖ్య స్ఫూర్తి

- దక్షిణాది ఎదిగితేనే దేశం పరుగులు
- కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి
- కాళేశ్వరం, పాలమూరుకు చేయూతనివ్వాలి
- విభజన సమస్యలకు ముగింపు పలకాలి
- 32వ దక్షిణ ప్రాంతీయ మండలి భేటీకి హైదరాబాద్ సిద్ధం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

కేంద్రం, రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాదమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య భిన్న ప్రయోజనాలు ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా పరిష్కారం కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందని పేర్కొన్నారు.

## దక్షిణాది ఒక్కటైతేనే బలం!

- రాష్ట్రాల మధ్య బలమైన సహకారం అవసరం
- ఆర్థిక కూటమిగా దక్షిణాది ఎదగాలి
- నీట్ రద్దుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి
- డీలిమిటేషన్‌లో ప్రాతినిధ్యం తగ్గొద్దు

2



## పొంగులేటి భారీ అవినీతి

చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత

మీడియా పాయింట్‌లో మంత్రి కోసం ఎదురుచూపు



.. వివరాలు 3లో

## ఏసీబీ వలలో 'కోట్ల' అధికారి


- శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఏకకాలంలో సోదాలు
- రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- మార్కెట్‌లో భారీ విలువ ఉంటుందని అంచనా
- భూములు.. ప్లాట్లు.. బంగారం.. వాహనాలు
- అక్రమాస్తుల కేసులో అరెస్ట్.. కోర్టుకు తరలింపు

2






## ధాన్యం బకాయిలపై కొరడా!



- 20 మంది రైస్ మిల్లర్ల జాబితా ఈడీకి
- ఆస్తులు.. బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తునకు నివేదిక
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపుపైనా అనుమానాలు
- తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ చట్టానికి రంగం సిద్ధం
- బకాయిల వసూలుకు సివిల్ సప్లయ్స్ శాఖ కఠిన చర్యలు

3



## సుష్మిత వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

కూతురి మాటలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?

క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

3






# ఏసీబీ వలలో 'కోట్ల' అధికారి

## శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఏకకాలంలో సోదాలు

## రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ

## మార్కెట్‌లో భారీ విలువ ఉంటుందని అంచనా

## భూములు.. ప్లాట్లు.. బంగారం.. వాహనాలు

## అక్రమాస్తుల కేసులో అరెస్ట్.. కోర్టుకు తరలింపు

**హైదరాబాద్, ఆగస్టు 20:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు. అధికారిక లెక్కల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.6.87 కోట్లుగా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషిమాత కాలనీలో ఉన్న శ్రీనివాసరెడ్డి నివాసంతో పాటు కార్యాలయం, ఆయనకు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సోదాలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడుల వివరాలను అధికారులు పరిశీలించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం కర్మన్‌ఘాట్‌లో శ్రీనివాసరెడ్డికి రెండు నివాస ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.2.63 కోట్లుగా లెక్కించారు. అదే ప్రాంతంలో రూ.1.61 కోట్ల విలువైన పెంట్‌హౌస్‌ను గుర్తించారు. యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో పది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు వివిధ ప్రాంతాల్లో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రూ.4 లక్షల నగదుతో పాటు బ్యాంకు ఖాతాలో రూ.8.60 లక్షల నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

### 680 గ్రాముల బంగారం.. ఏడు వాహనాలు

సోదాల్లో 680 గ్రాముల బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు కలిపి మొత్తం ఏడు వాహనాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.59 లక్షలుగా లెక్కించారు. ఇంట్లో మరో రూ.11 లక్షల విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించినట్లు తెలిపారు. బ్యాంకులో 46 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు కూడా దర్యాప్తులో బయటపడింది.


### 2009లోనూ అక్రమాస్తుల కేసు!

శ్రీనివాసరెడ్డిపై గతంలోనూ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు ఏసీబీ వెల్లడించింది. 2009లో మహేశ్వరం మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదైనట్లు తెలిపింది. అనంతరం మహేశ్వరం తహసీల్దార్‌గా కూడా ఆయన పనిచేసినట్లు సమాచారం. తాజా సోదాల్లో లభించిన పత్రాలు, ఆస్తులు, పెట్టుబడులు, బ్యాంకు లావాదేవీలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి శ్రీనివాసరెడ్డిని అరెస్ట్ చేసిన అధికారులు, హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

# 22ఏ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

- ప్రతి ఫిర్యాదుపై చివరి వరకు పర్యవేక్షణ
- కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- రైతుల భూ భద్రతకే 'భూ భారతి'
- నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు
- అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 20:** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ శాఖను మరింత ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును కేవలం దరఖాస్తుగా కాకుండా బాధ్యతగా తీసుకుని సమస్య పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మరోవైపు రైతుల భూములకు భద్రత కల్పించేందుకే 'భూ భారతి' సర్వే చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి.. శుక్రవారం నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. 22ఏ సమస్యలపై ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారం, ఎక్కువగా ఏ అంశాలపై ప్రజలు సంప్రదిస్తున్నారనే విషయాలపై పొంగులేటి అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్‌కు వెంటనే పంపించాలని మంత్రి ఆదేశించారు. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? రికార్డుల్లో వాస్తవ పరిస్థితి ఏమిటి? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు.




### కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

సమస్య చెప్పిన తర్వాత పరిష్కారం కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని పొంగులేటి స్పష్టం చేశారు. సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన వాటినీ వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ఇకపై దరఖాస్తులు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. "రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోవద్దు. పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### రైతుల భూ భద్రతకే 'భూ భారతి'

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పొంగులేటి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల భూములకు భద్రత కల్పించడం, భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే 'భూ భారతి' సర్వే లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో భూములు లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపించారు. ధరణి వ్యవస్థలో జరిగిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని ఏడు గ్రామాల్లో భూ భారతి సర్వే ప్రారంభమైందని తెలిపారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని, దశలవారీగా ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

### నేటి నుంచి జిల్లాల బాట

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు పొంగులేటి జిల్లాల వారీ సమీక్షలు చేపట్టనున్నారు. ఈ సమావేశాలు కేవలం అధికారిక సమీక్షలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కార మార్గాలను నిర్దేశించేలా నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షల్లో పాల్గొంటారు. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేయనున్నారు. రెవెన్యూ సమస్యలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థల సమస్యలపైనా సమీక్షించనున్నారు. తొలుత శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాలలో నిర్వహించనుండగా, శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అంశాలపై నిజామాబాద్‌లో సమీక్ష చేపట్టనున్నారు. మొత్తంగా 22ఏ సమస్యల పరిష్కారం నుంచి భూభారతి సర్వే వరకు రెవెన్యూ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది.

# దక్షిణాది ఒక్కటైతేనే బలం!

## రాష్ట్రాల మధ్య బలమైన సహకారం అవసరం

## డ్రగ్స్‌పై ఉమ్మడి పోరు సాగిద్దాం

## ఆర్థిక కూటమిగా దక్షిణాది ఎదగాలి

## నీట్ రద్దుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి

## డీలిమిటేషన్‌లో ప్రాతినిధ్యం తగ్గొద్దు

**మహాబలిపురం:** దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు అన్ని రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. రాష్ట్రాల మధ్య బలమైన సహకారం ఏర్పడితేనే ఆర్థికంగా మరింత శక్తిమంతమైన దక్షిణ భారతాన్ని నిర్మించగలమన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ విస్తరణతో పాటు నదీ జలాలు, నీట్, డీలిమిటేషన్ వంటి కీలక అంశాల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణాది ప్రాంతీయ మండలి సమావేశంలో విజయ్ ప్రసంగించారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ ఆర్థిక బలాన్ని మరింత పెంచుకునేందుకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యవసరమన్నారు. తయారీ కేంద్రాలు, సరకు రవాణా పార్కులు, ప్రత్యేక రవాణా మార్గాల నిర్మాణం ద్వారా దక్షిణాది ప్రాంతాన్ని సమీకృత ఆర్థిక కూటమిగా తీర్చిదిద్దాలని విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూరు వరకు మెట్రో రైలు విస్తరణ అంతర్రాష్ట్ర సహకారానికి మంచి నమూనా అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు సంబంధిత రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. 'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' లక్ష్యంగా అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని విజయ్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన నిఘా సమాచారాన్ని రాష్ట్రాలు ఎప్పటికప్పుడు పంచుకోవాలని, డ్రగ్స్ ముఠాలపై ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలు, అనధికార పంపిణీపైనా కఠిన నిఘా అవసరమన్నారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిలో సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని విజయ్ సూచించారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం కలిగిన తమిళనాడు.. ఓడరేవులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాబోయే ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలతో పాటు వాటి పనితీరునూ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదన్నారు. వస్తు సేవల పన్ను అమలు తర్వాత రాష్ట్రాలు కోల్పోయిన ఆర్థిక స్వేచ్ఛపైనా పునరాలోచన అవసరమని అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను విజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విధానం గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర కోటాలోని




వైద్య, దంత, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసుకునే అవకాశం తమిళనాడుకు కల్పించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి రాకూడదని విజయ్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్యం తగ్గదనే చట్టపరమైన హామీని కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో న్యాయస్థానాల తీర్పులు, ట్రైబ్యునళ్ల అవార్డులను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. కావేరీ జలాల విషయంలో ఆదేశాలను సకాలంలో అమలు చేయడంతో పాటు ముల్లపెరియార్ ఆనకట్ట భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశంలో న్యాయస్థానాల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. "బలమైన రాష్ట్రాలతోనే బలమైన దేశం సాధ్యం. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్టపాలనతో పరిష్కరించుకునేందుకు తమిళనాడు సిద్ధంగా ఉంది" అని విజయ్ స్పష్టం చేశారు.

# సమస్యలు తేల్చడమే అసలైన సమాఖ్య స్ఫూర్తి

## దక్షిణాది ఎదిగితేనే దేశం పరుగులు

## కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి

## కాళేశ్వరం, పాలమూరు పథకాలకు కేంద్రం చేయూతనివ్వాలి

## విభజన సమస్యలకు ఇకనైనా ముగింపు పలకాలి

## 32వ దక్షిణ ప్రాంతీయ మండలి భేటీకి హైదరాబాద్ సిద్ధం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహాబలిపురం, ఆగస్టు 20:** కేంద్రం, రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాదమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య భిన్న ప్రయోజనాలు ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా పరిష్కారం కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో తెలంగాణ తరపున భట్టి విక్రమార్క పలు కీలక అంశాలను ప్రస్తావించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ఆర్థిక సహాయం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తెలంగాణ వైఖరిని స్పష్టం చేశారు. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ఉదాహరణగా ప్రస్తావించిన భట్టి.. బలమైన నిర్మాణంలో ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, కానీ ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, సమర్థంగా సమన్వయం చేయగల వ్యవస్థలే నిజమైన సమాఖ్యవాదానికి నిదర్శనమన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభను ఆకర్షించడంలో రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనన్నారు. అయితే నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావని గుర్తుచేశారు. సమస్యలు కూడా రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ఫైళ్ల కంటే వేగంగా దాటుతాయని చమత్కరించారు. అందుకే దక్షిణ ప్రాంతీయ మండలి వంటి వేదికల ప్రాధాన్యం మరింత పెరిగిందన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వైఖరి స్పష్టంగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను కోరుతున్నామని తెలిపారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలు వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున చట్టపరమైన ప్రక్రియ ద్వారా వీలైనంత త్వరగా పరిష్కారం రావాలని ఆకాంక్షించారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని స్పష్టం చేశారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని భట్టి కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు ముందుకు సాగుతున్నాయని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశాలుగా కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మార్చే అభివృద్ధి ప్రాజెక్టులుగా చూడాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉండటాన్ని భట్టి ప్రస్తావించారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వాటికి తుది పరిష్కారం చూపాల్సిన సమయం వచ్చిందన్నారు. "పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కాదు. ప్రతి కొన్నేళ్లకు కొత్త అర్థాలు, కొత్త వివరణలు ఇవ్వడం కాదు. పెండింగ్ అంశాలు ఇక తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలి" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోంశాఖకు సమర్పించిందన్నారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉన్నప్పటికీ, అది పునర్వ్యవస్థీకరణ చట్టం పరిధిలోనే జరగాలని తేల్చిచెప్పారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా, సరకు రవాణా వ్యవస్థలు, ఆర్థిక పోటీతత్వం రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని భట్టి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు ఒకవైపు పోటీ పడుతూనే మరోవైపు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే.. భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని భట్టి ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు రావాలని ఆకాంక్షించారు. సమస్యల పరిష్కారానికి మరో ట్రిబ్యునల్, మరో కమిటీ, మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు అవసరం లేని స్థాయిలో నిర్ణయాలు జరగాలని కోరారు. తదుపరి సమావేశానికి వచ్చే అన్ని రాష్ట్రాల ప్రతినిధులకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

# ధాన్యం బకాయిలపై కొరడా!

## 20 మంది రైస్ మిల్లర్ల జాబితా ఈడీకి

- ఆస్తులు.. బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తునకు నివేదిక
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపుపైనా అనుమానాలు
- తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ చట్టానికి రంగం సిద్ధం
- బకాయిల వసూలుకు సివిల్ సప్లయ్స్ శాఖ కఠిన చర్యలు



**హైదరాబాద్, ఆగస్టు 20:** ప్రభుత్వ ధాన్యం బకాయిలను భారీగా ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల వివరాలను సివిల్ సప్లయ్స్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అందజేసినట్లు సమాచారం. ధాన్యం లావాదేవీలతో పాటు మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకున్న కొందరు మిల్లర్లు నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించాల్సిన బియ్యం లేదా అందుకు సంబంధించిన బకాయిలను చెల్లించకుండా భారీగా పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా కొందరి నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ప్రభుత్వం కఠిన చర్యల దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

### ఆర్థిక లావాదేవీలపై ఈడీ నజర్

ధాన్యం వ్యవహారాల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించారా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును ఇతర వ్యాపారాలకు మళ్లించారా? హవాలా మార్గంలో ఆర్థిక లావాదేవీలు జరిగాయా? అనే అనుమానాలపైనా విచారణ జరపాలని ఈడీకి అందించిన నివేదికలో కోరినట్లు సమాచారం. సంబంధిత మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్ రికార్డులను పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### తొమ్మిది మందిపై పీడీ చట్టం!

మరోవైపు ప్రభుత్వ బకాయిల విషయంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది రైస్ మిల్లర్లపై పీడీ చట్టం ప్రయోగించే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా బకాయిలు చెల్లించకపోవడం, భారీ మొత్తాలను పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ దిశగా చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ధాన్యం విషయంలో నిర్లక్ష్యం, అక్రమాలకు తావులేకుండా బకాయిలను పూర్తిస్థాయిలో రాబట్టాలన్న లక్ష్యంతో సివిల్ సప్లయ్స్ శాఖ చర్యలను ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. ఈడీ విచారణ మొదలైతే మిల్లర్ల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వ్యవహారాల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సుష్మిత వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

## కూతురి మాటలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?

**ఆమె అభిప్రాయాలతో నాకు సంబంధం లేదు • పార్టీ క్రమశిక్షణపై పూర్తి గౌరవం ఉంది**

**నోటీసును వెనక్కి తీసుకోవాలి • క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ**



**హైదరాబాద్, ఆగస్టు 20:** తన కుమార్తె సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయడం సమంజసం కాదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి గురువారం లేఖ రాశారు. తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. సుష్మిత తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు తాను రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని సురేఖ పేర్కొన్నారు. ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు కుటుంబ సభ్యులను బాధ్యులను చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. తన ప్రమేయం లేని అంశంలో వివరణ కోరడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సుష్మిత వ్యాఖ్యల విషయంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదన్న విషయాన్ని గుర్తించాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### సుష్మిత వ్యాఖ్యలతో రచ్చ

వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం నిర్వహించిన కొండా సురేఖ జన్మదిన వేడుకలకు సుష్మితా పటేల్ హాజరై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేస్తానని, కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని పలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుష్మిత వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ దీనిపై నివేదిక కోరగా, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కూడా స్పందించారు. కొండా సురేఖ నుంచి వివరణ కోరతామని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే సురేఖ క్రమశిక్షణ కమిటీకి లేఖ రాస్తూ.. "సుష్మిత మాటలు ఆమె వ్యక్తిగతం.. వాటికి నన్ను బాధ్యురాలిని చేయొద్దు" అని స్పష్టం చేశారు.

# 22ఏపై రాహుల్‌కు హరీశ్ లేఖ

**తెలంగాణలో సెక్షన్ దుర్వినియోగమంటూ ఆరోపణ**

**వేలాది ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని విమర్శ**

**రెవెన్యూలో 30 శాతం వసూళ్ల దందా అంటూ ధ్వజం**

**పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్**

**స్వతంత్ర విచారణకు ఆదేశించాలని రేవంత్ సర్కారుకు సవాల్**



**హైదరాబాద్, ఆగస్టు 20:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. 22ఏ సెక్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించిన ఆయన.. ఈ వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సంబంధిత అనుమతులు ఉన్న ఆస్తులను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో '30 శాతం వసూళ్ల దందా' సాగుతోందని హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించేందుకు దళారులు 30 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం మౌనం వీడాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంపై స్వతంత్ర విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆదేశించాలని హరీశ్‌రావు కోరారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీకి రాసిన లేఖలో హరీశ్‌రావు స్పష్టం చేశారు.



## బావిలోకి దూసుకెళ్లిన కారు..

# కుటుంబం బలి

**అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం.. భార్యాభర్తలు.. ఇద్దరు చిన్నారుల మృతి**

**సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా విషాదం**

**సిద్దిపేట, ఆగస్టు 20:** సిద్దిపేట జిల్లాలో అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన కారు రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భార్యాభర్తలతో పాటు నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. దుబ్బాక మండలం బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి అప్పనపల్లి శివారుకు చేరుకున్న సమయంలో కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో బావిలో పడిపోయిన కారును బయటకు తీశారు. కారులో ఉన్న రాజు, భాగ్య, నిహాన్ష్, శాన్విక మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు ఒకేసారి మృత్యువాత పడటంతో బలవంతాపూర్‌తో పాటు అప్పనపల్లి ప్రాంతంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



# మంత్రి పొంగులేటి భారీ అవినీతి

**చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత**

**మీడియా పాయింట్‌లో మంత్రి కోసం ఎదురుచూపు**

**హైదరాబాద్, ఆగస్టు 20:** రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. మంత్రి భారీ అవినీతికి పాల్పడ్డారని, అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయని ప్రకటించారు. తన ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన ఏలేటి.. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు చేరుకుని మంత్రి కోసం ఎదురుచూడటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పొంగులేటిపై తాను చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ఏలేటి స్పష్టం చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని బుధవారమే సవాల్ చేసిన ఆయన.. గురువారం స్వయంగా అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉంటానని, మంత్రి వచ్చి తన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డెడ్‌లైన్ విధించారు. భూభారతి, 22ఏ వ్యవహారాల్లో భారీ అక్రమాలు జరిగాయని ఏలేటి ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలకు సంబంధించిన భూ బదలాయింపులపైనా ఆయన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని విమర్శించారు. ఈ వ్యవహారాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నిజానిజాలను తేల్చేందుకు హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నానని, మంత్రి పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు కదిలేది లేదని ఏలేటి తేల్చిచెప్పారు. తన ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెబుతారా? లేక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరణ ఇస్తారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ప్రభుత్వం తరఫున ఎవరొచ్చినా తన వద్ద ఉన్న ఆధారాలను అందజేస్తానని ప్రకటించారు. అయితే ఏలేటి చేసిన ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందన వెలువడాల్సి ఉంది. దీంతో ఆధారాలు బయటపెడతానన్న ఏలేటి సవాల్‌కు మంత్రి ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# ఎర్రబెల్లి కాలువ బాటతో ఉద్రిక్తత

**అడ్డుకుని దేవరుప్పలకు తరలించిన పోలీసులు**



**జనగామ, ఆగస్ట్ 20:** మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాలువ బాట కార్యక్రమంతో జనగామ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలకు సాగు నీరు విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేపట్టిన కాలువ బాటను సింగరాజుపల్లి గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా చేపట్టారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని అరెస్ట్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కి తరలించారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎర్రబెల్లిని భేషరతుగా విడుదల చేయాలని ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా తోపులాటలో ఎర్రబెల్లికి నుదుటికి స్వల్పంగా గాయం కావడంతో పోలీసులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు.

# సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు

**జైలులోనే సజ్జన్ కుమార్ మృతి**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.

## సంపాదకీయం



# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి పెనుభారంగా మారుతున్నాయి. బియ్యం నుంచి పప్పుల వరకు, వంటనూనెల నుంచి కూరగాయల వరకు, చివరకు మందుల ధరలు కూడా పెరుగుతున్నాయి. కుటుంబ ఆదాయం అదే స్థాయిలో ఉండగా ఖర్చులు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ఎజెండాల్లో మునిగిపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ధరల పెరుగుదలను నియంత్రించేదెవరు? సామాన్యుడి జేబుకు పడుతున్న చిల్లును పూడ్చేదెవరు? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. సన్నబియ్యం కిలో ధర రూ.80 వరకు పలుకుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగి రూ.100కు చేరుతుందన్న ప్రచారం వినియోగదారులను కలవరపెడుతోంది. వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి తగ్గుదల, రవాణా ఖర్చులు వంటి కారణాలు చెబుతున్నా.. మార్కెట్లో ధరలు ఒక్కసారిగా ఎందుకు పెరుగుతున్నాయి? నిల్వలు ఎంత ఉన్నాయి? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అంశాలపై ప్రభుత్వాలు నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. బియ్యంతోనే సమస్య ముగియడం లేదు. పప్పులు, వంటనూనెలు, ఉప్పు సహా నిత్యావసరాల ధరలు కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. కూరగాయల్లో చాలా రకాలు కిలో రూ.60 నుంచి రూ.100 వరకు పలుకుతున్న సందర్భాలు ఉన్నాయి. మందుల ధరలు కూడా పెరుగుతుండటం మధ్యతరగతి, పేద కుటుంబాలకు మరో భారంగా మారుతోంది. ఆహారం, వైద్యం వంటి కనీస అవసరాలే భారంగా మారితే అభివృద్ధి గణాంకాలు సామాన్యుడికి ఎంతవరకు ఊరటనిస్తాయన్నది పాలకులు ఆలోచించాలి.

### రాజకీయాల హోరులో ధరల గోడు

తెలుగు రాష్ట్రాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి, వైకాపా మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 22ఏ భూముల వివాదం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధానికి దారితీసింది. భూములు, కమిషన్లు, ప్రభుత్వ వైఫల్యాలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. జాతీయస్థాయిలోనూ అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ అంశాల చుట్టూనే చర్చను నడిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల వ్యూహాలు, ప్రత్యర్థులపై విమర్శలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో.. ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న ధరల సమస్యకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ప్రజల ఇంటి బడ్జెట్, ఉపాధి, సంక్షేమం గురించి మాట్లాడే పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే శ్రద్ధ చూపాలి.

### గణాంకాలు కాదు.. ఉపశమనం కావాలి

పన్నుల వసూళ్లు పెరిగాయని, ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోందని చెప్పుకోవడం మాత్రమే సరిపోదు. మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడు తన సంపాదనతో అవసరమైన సరుకులు కొనగలుగుతున్నాడా లేదా అన్నదీ ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన కొలమానమే. కిలో బియ్యం కొనడానికి కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి వస్తే ఆర్థికాభివృద్ధి ఫలాలు కిందిస్థాయి ప్రజలకు చేరుతున్నాయా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

### మార్కెట్‌ను వ్యాపారుల ఇష్టానికి వదలొద్దు

ధరల నియంత్రణ అంటే వ్యాపారులపై దాడులు చేయడం మాత్రమే కాదు. ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వరకు సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఎక్కడ కొరత ఏర్పడుతోంది, ఎక్కడ అనవసరంగా నిల్వ చేస్తున్నారు, మధ్యవర్తుల వల్ల ధర ఎంత పెరుగుతోంది, రైతుకు లభిస్తున్న ధరకు వినియోగదారుడు చెల్లిస్తున్న ధరకు మధ్య ఎంత వ్యత్యాసం ఉందన్నది ప్రభుత్వాలు పరిశీలించాలి. అవసరమైనప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయడం, కృత్రిమ కొరతను అడ్డుకోవడం, రైతుబజార్లు, సహకార విక్రయ కేంద్రాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టాలి. ధరల పెరుగుదల కేంద్రానిదా, రాష్ట్రానిదా అని బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టుకోవడం వల్ల సామాన్యుడికి ప్రయోజనం ఉండదు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. నిత్యావసరాల ధరలపై నిరంతర సమీక్షకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. అవసరమైన వస్తువుల నిల్వలు, సరఫరా, ధరల వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి.

**ఎన్నికల్లో గెలవడం రాజకీయ పార్టీల లక్ష్యం కావచ్చు. కానీ అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే పాలనకు అసలు పరీక్ష. అన్నం, పప్పు, నూనె, కూరగాయలు, మందులు సామాన్యుడికి అందుబాటు ధరల్లో లభించేలా చూడడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. ఇప్పటికైనా రాజకీయ విమర్శల నుంచి కొంత సమయాన్ని ప్రజల వంటింటి వైపు మళ్లించాలి. లేదంటే మార్కెట్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారి.. 'ధరలను కంట్రోల్ చేసేదెవరు?' అన్న ప్రశ్న మరింత బలంగా వినిపించడం ఖాయం.**

# రాజీవ్‌కు ఘన నివాళి







- వీర్‌భూమి వద్ద కాంగ్రెస్ అగ్రనేతల అంజలి
- సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంక నివాళి
- ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ సేవలు చిరస్మరణీయమన్న కాంగ్రెస్
- సామాజిక మాధ్యమం వేదికగా మాజీ ప్రధానిని స్మరించుకున్న మోదీ
- దేశవ్యాప్తంగా సద్భావనా దివస్ కార్యక్రమాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ స్మారక స్థలం వీర్‌భూమిని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కాంగ్రెస్ పేర్కొంది. దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో, యువతకు అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన దార్శనికతను గుర్తుచేసుకుంది. వీర్‌భూమి వద్ద నివాళుల కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించాయి. వివిధ ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నాయి.

### రాజీవ్‌ను స్మరించుకున్న మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని ఏటా సద్భావనా దివస్‌గా నిర్వహిస్తారు. జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక, సమ్మిళిత భారత నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయాలన్న రాజీవ్ దార్శనికతను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం 1984లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. కేవలం 40 ఏళ్ల వయసులో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి భారత రాజకీయ చరిత్రలో అత్యంత పిన్న వయసులో ప్రధానమంత్రి అయిన నేతగా నిలిచారు.

# వందేమాతరంపై రాజకీయ రగడ

- రెండు చరణాలకే కాంగ్రెస్ మొగ్గు
- కాంగ్రెస్ తీరుపై బీజేపీ ఆగ్రహం
- 'కొత్త ముస్లిం లీగ్' అంటూ నితిన్ ధ్వజం
- ఓటు బ్యాంకు రాజకీయాలంటూ విమర్శలు
- దేశభక్తిపై ప్రశ్నించిన సుధాంశు త్రివేది





**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** జాతీయ గేయం 'వందే మాతరం'పై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉండాలని కాంగ్రెస్ నిర్ణయించగా, బీజేపీ తీవ్రంగా మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం సమావేశమై వందే మాతరం ఆలాపన విషయంలో 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందే మాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

### 'కొత్త ముస్లిం లీగ్'గా కాంగ్రెస్

కాంగ్రెస్ నిర్ణయంపై నితిన్ నబీన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. వందే మాతరాన్ని అవమానించడం అంటే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది కూడా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్ జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించారు.

### చరిత్రను తెరపైకి తెచ్చిన బీజేపీ

వందే మాతరంపై గతంలో ముస్లిం లీగ్ వ్యక్తం చేసిన అభ్యంతరాలను కూడా బీజేపీ నేతలు ప్రస్తావించారు. అప్పటి వైఖరికి, ప్రస్తుతం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి పోలికలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ మాత్రం 1937లో తీసుకున్న నిర్ణయాన్నే కొనసాగిస్తున్నామని స్పష్టం చేస్తోంది. దీంతో వందే మాతరం ఆలాపన అంశం మరోసారి జాతీయస్థాయిలో రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది.

# పాకిస్థాన్ యాక్షన్.. భారత్ రియాక్షన్!

- ఢిల్లీలో పాక్ హైకమిషన్ వద్ద బారికేడ్ల తొలగింపు
- ట్రాఫిక్ బొల్లార్డ్స్, క్యూలైన్లపైనా వేటు
- ఇస్లామాబాద్ చర్యకు మూడు రోజుల్లోనే ఢిల్లీ బదులు
- 'దెబ్బకు దెబ్బ' చర్యగా దౌత్యవర్గాల్లో చర్చ
- కశ్మీర్‌పై అమెరికా రాయబారి వ్యాఖ్యలతో పాక్ గుర్రు

**న్యూఢిల్లీ:** భారత్–పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న దౌత్య ఉద్రిక్తతల నడుమ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ వెలుపల పాకిస్థాన్ అధికారులు చేపట్టిన చర్యలకు మూడు రోజుల వ్యవధిలోనే ఢిల్లీలో ప్రతిచర్య కనిపించింది. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్, క్యూలైన్ ఏర్పాట్లను భారత అధికారులు తొలగించారు. పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల అనుమతించిన పరిధిని దాటి కొన్ని ఏర్పాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వీసా విభాగం సమీపంలోని క్యూలైన్లు, బారికేడ్లు సహా ఇతర ఏర్పాట్లను జేసీబీ సాయంతో తొలగించారు. ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వెలుపల పాకిస్థాన్ అధికారులు ఇదే తరహా చర్యలు చేపట్టిన కొద్ది రోజులకే ఢిల్లీలో ఈ పరిణామం చోటుచేసుకోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వద్ద భద్రతా ఏర్పాట్లను తొలగించిన ఘటనకు ప్రతిచర్యగానే ఢిల్లీలో తాజా చర్యలు చేపట్టారన్న చర్చ సాగుతోంది. 'దెబ్బకు దెబ్బ' అన్న తరహాలో భారత్ స్పందించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పాకిస్థాన్ చర్యకు ప్రతీకారంగానే బారికేడ్లు తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. ఇరుదేశాలు పరస్పరం దౌత్య కార్యాలయాల వద్ద ఏర్పాట్లను తొలగించుకోవడం మాత్రం కొత్త చర్చకు తెరలేపింది.

### కశ్మీర్ వ్యాఖ్యలతో పాక్‌కు మరో మంట

మరోవైపు జమ్మూకశ్మీర్‌పై అమెరికా రాయబారి సెర్జియో గోర్ చేసిన వ్యాఖ్యలు పాకిస్థాన్‌కు ఆగ్రహం తెప్పించాయి. జమ్మూకశ్మీర్ భారత్‌లో ముఖ్యమైన భాగమని పేర్కొన్న ఆయన, కశ్మీర్ లోయలో భద్రతా పరిస్థితులు మెరుగుపడ్డాయని వ్యాఖ్యానించారు. అమెరికా ప్రయాణ హెచ్చరికలను పునఃపరిశీలించే అవకాశముందని కూడా సంకేతాలిచ్చారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన పాకిస్థాన్.. ఇస్లామాబాద్‌లోని అమెరికా ఛార్జ్ డి'అఫైర్స్ నాటలీ బేకర్‌ను విదేశాంగ శాఖకు పిలిపించి నిరసన తెలిపింది. జమ్మూకశ్మీర్ అంశంపై తమ వైఖరిని మరోసారి వెల్లడించింది. దీంతో భారత్–పాక్ దౌత్య ఉద్రిక్తతలకు కశ్మీర్ అంశం కూడా తోడై పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది.

# విద్యార్థుల కంటే మంత్రి కుక్కలకే మెరుగైన సౌకర్యాలు!

- సర్కారు బడుల దుస్థితిపై అభిజిత్ దీప్కే ఆగ్రహం
- విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామాకు డిమాండ్
- 'ధర్మం కాదు.. పిల్లల భవిష్యత్తే ప్రమాదంలో'
- బడులు బాగుచేయకుంటే నేతలను ఊళ్లలోకి రానివ్వొద్దని పిలుపు
- 2029 ఎన్నికల్లో జెన్ జీ కీలక శక్తిగా మారుతుందని హెచ్చరిక

**లాతూర్, ఆగస్టు 20:** మంత్రులు, ప్రజాప్రతినిధులు పెంచుకునే కుక్కలకు ఉన్న సౌకర్యాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లేవని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజిత్ దీప్కే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహారాష్ట్రలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులను ఇలాంటి పరిస్థితుల్లో చదివిస్తున్నందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భుసే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా లాతూర్ జిల్లా ఔసా తహసీల్‌లోని ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను సీజేపీ బృందంతో కలిసి దీప్కే పరిశీలించారు. పాఠశాలలో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, ఇతర కనీస వసతులు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రేకుల కప్పుల నుంచి నీరు కారడం, పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, అపరిశుభ్ర వాతావరణంతో ఆవరణలు పాములకు నిలయాలుగా మారుతున్నాయని ఆరోపించారు. పాముకాటు ఘటనల్లో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేని నాయకులకు ప్రజలు ఎందుకు ఓటేయాలని దీప్కే ప్రశ్నించారు. కేవలం హెలికాప్టర్లలో తిరిగేందుకే నాయకులకు ప్రజలు ఓట్లు వేస్తున్నారా అంటూ నిలదీశారు. 'ధర్మం ప్రమాదంలో ఉంది' అంటూ రాజకీయాలు చేసే నేతలు ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్న విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే అక్కడి వాస్తవ పరిస్థితులు వారికి అర్థమవుతాయని అన్నారు. పాఠశాలలను బాగుచేసే వరకు ఓట్ల కోసం వచ్చే నాయకులను గ్రామాల్లోకి రానివ్వకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.

### 2029లో జెన్ జీ దెబ్బ చూపిస్తుంది

2029 ఎన్నికల నాటికి జెన్ జీ యువత కీలకమైన ఎన్నికల శక్తిగా అవతరిస్తుందని దీప్కే హెచ్చరించారు. యువత, విద్యార్థుల సమస్యలను రాజకీయ పార్టీలు పరిష్కరించకపోతే ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలను తక్షణమే మెరుగుపరచకపోతే గ్రామాల వారీగా పెద్దఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. లాతూర్ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసుపైనా దీప్కే స్పందించారు. దర్యాప్తు కిందిస్థాయి నిందితులకే పరిమితమవుతోందని, పెద్ద తలకాయలను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఉన్నతస్థాయి అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద వ్యవహారం జరగడం సాధ్యం కాదని, అసలు బాధ్యులను బయటకు తీసుకొచ్చేలా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

# హైమాస్ట్ లైట్ల ప్రారంభం



**ఉద్యమ కెరటం, కెరమెరి:**
స్థానిక గ్రామ పంచాయతీలో నూతనంగా అమర్చిన హైమాస్ట్ లైట్లను గురువారం సర్పంచ్ పెందోర్ ఆనందరావు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో, సీఎస్ఆర్ నిధుల నుంచి పంచాయతీకి 8 హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ లైట్ల ఏర్పాటుతో గ్రామంలోని ప్రధాన ప్రాంతాలు ప్రకాశ వంతంగా మారతాయని, ప్రజలకు రాత్రి వేళల్లో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగమైన మౌలిక వసతుల కల్పనకు ఇది మంచి పరిణామమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో మరింత అభివృద్ధి సాధిస్తామని, త్వరలోనే మరికొన్ని వార్డుల్లోనూ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఉప సర్పంచులు శ్రీకాంత్, రిజ్వాన్, నాయకులు కంబాల వినేష్, సెండే నారాయణ, మున్ను, ముజిబ్, రాంచందర్, పెందోర్ శ్రీనివాస్, సలీమ్, ప్రకాష్, మండోర్ మోతిరాం, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత బ్యాగులు, నోటు పుస్తకాలు, షూల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచితంగా అందించిన బ్యాగులు, నోటు పుస్తకాలు, షూలను గురువారం గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్ రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి లక్ష్యాలతో ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్, వీడీసీ చైర్మన్ లను కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, అధ్యాపక బృందం శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

## మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్ అన్నారు. పట్టణంలోని గాంధీ పార్కులో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఇళ్ల వద్ద కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, అవి చెట్లుగా ఎదిగే వరకు వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అవికిరణ్, స్టేప్ మాజీ సీఈఓ వెంకటేశ్వర్లు, స్టేప్ అధికారులు, గాంధీ పార్కు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
జిల్లాలో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు అన్ని రకాల పూర్వసిద్ధత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ ఆర్డీవో చెన్నూరి కిష్టయ్యలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 23,934 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారని కలెక్టర్ తెలిపారు. రవాణా సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బంది లేని ఎత్తైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు కావాల్సిన గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు మరియు టార్పాలిన్ కవర్ల అవసరాలను అంచనా వేసి ప్రభుత్వానికి తక్షణమే ఇండెంట్ పంపాలని స్పష్టం చేశారు. అలాగే, సేకరణ కేంద్రాల వద్ద ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, జిల్లా మేనేజర్ రజిత, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, సహాయ పౌర సరఫరాల అధికారి సాదిక్ హుస్సేన్లతో పాటు ఐకేపీ, సహకార, తూనికలు-కొలతల శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాదకర విద్యుత్ స్తంభాల మార్పిడికి చర్యలు

- **వార్డుల్లో చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ అహ్మద్ పర్యటన**



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ : ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ, 20వ వార్డులలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్‌లు గురువారం ప్రత్యేకంగా పర్యటించారు. విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరాజం, నాయకులతో కలిసి వార్డులలోని పలు వీధుల్లో విస్తృతంగా విజిట్ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రమాదకరంగా మారిన పాత విద్యుత్ స్తంభాలను (పవర్ పోల్స్) వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలోని ప్రజల భద్రతే తమకు మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా, త్వరలోనే వాటిని తొలగించి నూతన విద్యుత్ పోల్స్ అమర్చాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎత్తేశాం, సమద్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# 30 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

## వాహనం సీజ్



**ఉద్యమ కెరటం, సిర్పూర్ టీ:**
మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రాయితీ (పీడీఎస్) బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి వజీద్ అలీ, డిటి (ఎన్ఫోర్స్‌మెంట్) రాజ్ కుమార్, సిర్పూర్ (టీ) గిర్దవర్ సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. సిర్పూర్ (టీ) చుట్టుపక్కల గ్రామాల రేషన్ కార్డుదారుల నుండి కొనుగోలు చేసిన 63 బస్తాల (సుమారు 30 క్వింటాళ్లు) పిడిఎస్ బియ్యాన్ని 'మహేంద్ర పిక్-అప్' ( TG20T 2185 ) వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తుండగా అధికారులు అడ్డుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. ప్రాథమిక వివరాల ప్రకారం ఈ అక్రమ రవాణా వెనుక సిర్పూర్ (టీ) కు చెందిన సురేష్ కేదార్ ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా అందిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని దుర్వినియోగం చేసినా, రీ-సేల్ చేసి అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** దివంగత మాజీ ప్రధాని, ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన మహానేత రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నేరడిగొండ మండల అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని డిజిటల్, కంప్యూటర్ యుగంలోకి తీసుకెళ్లిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా రాజకీయాల్లో యువశక్తికి ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. అలాగే పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి అధికారాలను గ్రామస్థాయికి వికేంద్రీకరించడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు దేశాభివృద్ధికి నేటికీ మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ ఆడే వసంత్ రావు, జిల్లా మైనారిటీ సెక్రటరీ వకీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగంపల్లి సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదవ వసంత్, బుక రాములు, రాథోడ్ వసంత్ రావు, మైనారిటీ మండల అధ్యక్షుడు ఖాజా, నాయకులు అంజన్న, సంతోష్, తజమూల్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

- **ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి సాంకేతిక విప్లవానికి బాటలు వేసిన దివంగత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేతలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను, సాంకేతిక రంగంలో తీసుకొచ్చిన మార్పులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆధునీకీకరణకు రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా ఐటీ, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి పునాదులు వేసి దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం 18 సంవత్సరాలు నిండిన యువత కోసం నూతన ఓటర్ల నమోదు ఫారం-6 ప్రత్యేక డ్రైవ్ను ప్రారంభించారు. శ్రీకాంత్ రెడ్డి స్వయంగా ఓటరు నమోదు ఫారాలను నింపి, యువతకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి, డీసీసీ ఆఫీస్ ఇన్చార్జ్ గౌలి సంజయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖీజర్ పాషా, మాజీ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట



**ఉద్యమ కెరటం, భీంపూర్:** మహిళా సాధికారత, గ్రామీణ మహిళల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పిప్పలకోటి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు సొంత భవనాలు ఉండాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా పిప్పలకోటి గ్రామానికి వీవో బిల్డింగ్ మంజూరైందని తెలిపారు. గురువారం పిప్పలకోటి గ్రామంలో వీవో భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి వీవో బిల్డింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకునేందుకు ఈ భవనం వేదికగా నిలుస్తుందన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి వీవో భవనాల మంజూరే నిదర్శనమని పేర్కొన్నారు. పిప్పలకోటిలో నిర్మించనున్న భవనాన్ని నాణ్యత ప్రమాణాలతో, అన్ని హంగులతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణిగుంట శ్రీనివాస్, గడ్డం వివేకానంద్, షేక్ ఛోటు, గ్రామ సంఘాల ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాన్ మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు వెంటనే జారీ చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య లతో కలిసి జూన్ మీటింగ్ ద్వారా తహసిల్దార్లు, సూపర్వైజర్లతో నాన్ మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు, అనుమలిస్ జాబితాలో గల ఓటర్ల వ్యత్యాసాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు జిల్లాలో 20 వేల 929 మంది ఉన్నారని, వారందరికీ నిర్ణీత గడువులోగా నోటీసులు అందించి వారి నుండి ఎన్నికల సంఘం పేర్కొన్న ఆధారాలను స్వీకరించాలని తెలిపారు. నోటీసులను ముందుగానే అందించి కొంత గడువు ఇవ్వాలని, అక్టోబర్ 5వ తేదీలోగా నాన్ మ్యాపింగ్ ఓటర్ల హియరింగ్ పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లలో పేరు, తండ్రి పేరు, వయసు వంటి వ్యత్యాసాలను బూత్ స్థాయి అధికారుల లాగిన్, తహసిల్దార్ లాగిన్ లలో విచారించి చిన్నచిన్న వ్యత్యాసాలను సవరించవచ్చని, తద్వారా అనమలిస్ జాబితాలో గల




ఓటర్లను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాలను వెంటనే చేపట్టాలని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించేదిలేదు

- ఉట్నూర్ ఏఎస్పి రుత్విక్ సాయి కొట్టే
- ఇచ్చోడలోని ఇస్లాంనగర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్
- 110 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 4 కార్లు స్వాధీనం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఉట్నూర్ ఏఎస్పి రుత్విక్ సాయి కొట్టే స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు



అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. 110 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 4 కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు అమర్చిన 15 బైక్లను సైతం సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కాలనీ ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సీఐలు సిహెచ్ రమేష్, కె.నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎన్.చంద్రశేఖర్, ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ భారతదేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. యువత సాధికారత, విద్య, సాంకేతిక రంగాల అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కర్రే కృష్ణ, టీపీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఎ హకీమ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచులు శ్రీహరి, పోచ గౌడ్, ముచ్చర్ల యాదగిరి, కొట్టం వెంకటేష్, నాయకులు కొన్యాల వెంకటేష్, రాజన్న, నరసింహారెడ్డి, నల్లోల్ల పెంటయ్య, ఆకుల కిష్టయ్య, రామే రాములు, పెంటేష్, తోఫిక్, ఇబ్రహీం, అద్నాన్, చెన్నారెడ్డి, నరేందర్, ఆసిఫ్ హుస్సేన్, సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు గౌస్ బాషా



పాషా, అరిగే సాయి తదితరులతో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు

- ఇందిరమ్మ ఇళ్ల జాబితా నిలిపివేయాలి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొందరు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని, ఈ నేపథ్యంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం ఎంపీడీఓ రాజేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు కాకుండా డబ్బులు తీసుకుని అనర్హుల పేర్లను జాబితాలో చేర్చినట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. నిజమైన అర్హులను



గుర్తించేందుకు కనీసం 15 రోజుల గడువు ఇవ్వాలని, ఈ సమయంలో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను సిద్ధం చేసి అధికారులకు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులైన పేదలకు మాత్రమే చేరాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణల కారణంగా సంక్షేమ పథకాల అసలు ఉద్దేశం దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు పెన్షన్లు, కుట్టు మిషన్లు తదితర సంక్షేమ పథకాలు కూడా పూర్తిగా పారదర్శకంగా అర్హులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు సమాచారం లేకుండా లబ్ధిదారుల జాబితాను ఎలా ఖరారు చేస్తారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా మండల అధికారులు తమ విధానాన్ని మార్చుకుని, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించిన అనంతరం పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కూడెల్లి ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏడబోయిన ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మల్యాల రాజేశ్వర్, నాయకులు బంగ్లా రాజు గౌడ్, శంకర్ రాజశేఖర్, నరేష్ వర్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఇబ్బందులపై బీజేపీ ధర్నా

- వారం రోజుల్లో మట్టి రోడ్డు ఏర్పాటు చేస్తామన్న అధికారులు


**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణం ఎదుట విద్యార్థుల రాకపోకల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, డిగ్రీ విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, స్థానిక సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కోడె రమేష్ మాట్లాడుతూ గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మాణంలో ఉన్న హై లెవల్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలు, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా మట్టి రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కళాశాలలకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు బస్సుల్లో వస్తున్నారని, ప్రస్తుతం మట్టి రోడ్డు తొలగించడంతో బస్సులు సమయానికి రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రవాణా సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న తహశీల్దార్ మారుతి రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, వారం రోజుల్లో తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ



జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి తొట్ల మల్లేష్ యాదవ్, నాయకులు దేవేందర్ యాదవ్, రాజేష్ చారి, డిగ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిద్దాం

**ఉద్యమ కెరటం, బోథ్:** భారత మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ కొనసాగిద్దామని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం ఢిల్లీలోని వీర్‌భూమి వద్ద నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి, దేశానికి ఆయన అందించిన విశేష సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. దేశ యువతకు సాంకేతికతను చేరువ చేయడంతో పాటు, భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. నేటితరం రాజీవ్ గాంధీ ఆశయాలు, సద్భావనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, సామాజిక ఐక్యత కోసం ప్రతిఒక్కరూ నిరంతరం కృషి చేయడమే రాజీవ్ గాంధీకి అందించే నిజమైన నివాళి స్పష్టం చేశారు.



# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** భారత మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని తాండూర్ మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణుకళ్యాణ్ ఆధ్వర్యంలో తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, తాండూర్ గ్రామ సర్పంచ్ ముడిమాడుగుల సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి ఈసా, కిష్టంపేట సర్పంచ్ సార్ల తిరుపతి, నాయకులు గోవర్ధన్, సింగిల్ విండో డైరెక్టర్ మసాడి తిరుపతి, ఉప సర్పంచ్లు డాక్టర్ సత్యం, నల్లుల మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాత నాగరాజు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డా.ఝూన్సీరాణి, యూత్ కాంగ్రెస్ తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి పురం శెట్టి అరుణ్, వార్డు సభ్యులు పులగం శ్రీకాంత్, నాయకులు కంపేల శ్రీనివాస్, నియాజ్, ప్రశాంత్, ముహ, రాజేశం, నరేందర్, ప్రసాద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్ వాడీ కేంద్రంలో ఘనంగా సీమంతం



ఉద్యమ కెరటం, తాండూర్: తాండూర్ సెక్టార్ పరిధిలోని అచలాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ గర్భిణీలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. హిమోగ్లోబిన్ స్థాయి 12 శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భధారణ సమయంలో 10 నుంచి 14 కిలోల వరకు బరువు పెరగడం సాధారణమని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటిని వేడి చేసి, చల్లార్చిన అనంతరం తాగాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల బరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మల్లు బాయి, హెల్పర్ సరిత, ఏఎన్ఎం ప్రవీణ, ఎంఎల్‌హెచ్‌వీ ప్రసన్న, ఆశా కార్యకర్తలు, నర్సులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# విద్యా భారతి పాఠశాలలో సంతాప సభ




**ఉద్యమ కెరటం, తాండూర్:** నల్గొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు గురైన ఘటనపై తాండూర్ మండలం కిష్టంపేట గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా భారతి పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ రూపారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికానంద్



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతిని అమలు చేయాలని, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికానంద్ డిమాండ్ చేశారు. తిర్యాణి మండలంలోని జండగూడ గ్రామ కమిటీ హాల్‌లో నిర్వహించిన డివైఎఫ్ఐ నూతన తిర్యాణి మండల కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య 1980 నవంబర్ 3న లుథియానా నగరంలో జరిగిన మొదటి మహాసభల్లో ఆవిర్భవించిందని గుర్తుచేశారు. "దేశం ముక్కలైనా... ప్రజల సమగ్రతను, ఐక్యతను ముక్కలు కానివ్వం" అనే పటిష్టమైన నినాదంతో డివైఎఫ్ఐ దేశ ఐక్యత, సమగ్రతల కోసం నిరంతరం పని చేస్తోందని తెలిపారు. యువతను సక్రమమైన మార్గంలో నడిపించేందుకు డివైఎఫ్ఐ పోరాడుతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే హామీలను నెరవేర్చకుండా యువతను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. దీనివల్ల దేశంలో యువశక్తి నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పోరాడటంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ తమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు.

**నూతన మండల కమిటీ ఎన్నిక:**

ఈ సమావేశంలో తిర్యాణి మండల నూతన డివైఎఫ్ఐ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్, కార్యదర్శిగా తళ్లపెల్లి రాజేశ్వర్ తో పాటు మరొక 11 మందితో కలిసి మొత్తం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు గేడం టికానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- సత్తుపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన.. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సత్తుపల్లి పట్టణంలో గురువారం పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శివసాయి నగర్‌లో బహుళార్థ సాధక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, కమల్ పాషా, డీఎంహెచ్ఓ, అదనపు డీఎంహెచ్ఓ, హెల్త్ ఈఈ, గంగారాం పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు తోట సుజలారాణి గణేష్, శరత్, ఇతర మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన, ఎన్ఎస్‌యూఐ విభాగాల నాయకులు, అధ్యక్షుడు సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నాభావు సాఠే ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**ఉద్యమ కెరటం, జైనూర్:** అన్నాభావు సాఠే ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. మండలంలోని ఉసేగం గ్రామంలో గురువారం సాహిత్య సామ్రాట్, ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు అన్నాభావు సాఠే 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అన్నాభావు సాఠే తన సాహిత్యం, రచనలు, కళారూపాల ద్వారా అణగారిన వర్గాల సమస్యలను సమాజం ముందుకు తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అన్నాభావు సాఠే రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్య పరిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మవలె దత్త, మండల సర్పంచ్ అనుసయ అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, భుజంగరావు, అజ్జు లాలా, అజీమ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

- పార్థివ దేహానికి నివాళులర్పించిన ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం గూడమామడ గ్రామంలో బుధవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఉప సర్పంచ్ సలీం కుమారుడు రాహేల్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ గురువారం గూడమామడ గ్రామంలోని వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌తో కలిసి రాహేల్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆమె అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రహేల్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యుడు పెందోర్ ప్రకాష్, ఆర్‌జీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కోవ ఇందిరా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రషీద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాడవి మనోహర్, గూడమామడ సర్పంచ్ కుంరం యశోద కేశవ్ రావు, జండాగూడ సర్పంచ్ ఉయిక చందన్ శావ్, పవర్‌గూడ సర్పంచ్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు గేడం గోపీచంద్, మాజీ ఎంపీటీసీ అజ్జు లాలా, జైనూర్ మాజీ ఉప సర్పంచ్ షేక్ అబ్బు, కోటేష్, షేక్ అజీమ్, గౌరి సర్పంచ్ భుజంగరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ, భానుచంద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలని ఎస్సై కొమరయ్య అన్నారు. సిర్పూర్(యు) మండలంలోని పంగిడి గ్రామంలో "డ్రగ్స్ రహిత తెలంగాణ– అందరి ధ్యేయం" అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై హాజరై ప్రజలు, యువతకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా నాశనం చేస్తుందని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని బుగ్గారం(బి) ఎంపీయూపీఎస్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, గుట్కా, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాలు ఆర్థిక, సామాజిక ఇబ్బందులకు గురవుతాయని వివరించారు. అనంతరం "మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడుకుందాం" అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంతోనే పేదల ఇళ్ల కల సాకారం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజా ప్రభుత్వంతోనే పేదల ఇళ్ల కల సాకారమవుతుందని డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన బిక్కి లక్ష్మి–గంగన్న దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో వారి ఆహ్వానం మేరకు గురువారం నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగన్న దంపతులు సాజిద్ ఖాన్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం సాజిద్ ఖాన్ గ్రామ ప్రజలతో మమేకమై వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు తెలిపిన సమస్యలను ఓపికగా విని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎరువుల బుకింగ్‌లో మార్పులు

### మండల యూనిట్ పరిధిలోనే ఎరువుల బుకింగ్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతుల సౌకర్యార్థం ఎరువుల బుకింగ్ విధానంలో మార్పులు చేసినట్లు వేంసూర్ మండల వ్యవసాయ అధికారి రామమోహన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్ యాప్ ద్వారా ఇప్పటివరకు జిల్లా యూనిట్ పరిధిలో రైతులు ఎరువులను బుకింగ్ చేసుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గురువారం నుంచి ఎరువుల బుకింగ్ విధానాన్ని జిల్లా యూనిట్ నుంచి మండల యూనిట్ పరిధికి మార్చినట్లు తెలిపారు. ఇకపై వేంసూర్ మండల పరిధిలోని రైతులు తమ మండల పరిధిలోనే అవసరమైన ఎరువులను బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు ఈ మార్పును గమనించి, తమకు అవసరమైన ఎరువులను మండల పరిధిలోనే బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం



**ఉద్యమ కెరటం, హత్నూర:** భారతదేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించి ఐటీ విప్లవానికి పునాదులు వేసిన మహానేత, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని హత్నూర గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లోల్ల పెంటయ్య అన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించి దేశ రాజకీయాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. ప్రధాన మంత్రిగా దేశ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామే రాములు, పెంటేష్, వల్లిగారి కృష్ణ, ఉష్ణగళ్ల భూమయ్య, నర్సింలు, మహంకాళి లింగం, ఈరయ్య, కడల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 31వ వరకు పెన్షన్ దరఖాస్తులకు గడువు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేయాలి

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** చేయూత సామాజిక భద్రత పెన్షన్ దరఖాస్తులకు ఈనెల 31వ తేదీ తుది గడువు అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి ఎంపీడీఓలు, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ అధికారులతో పెన్షన్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్లు, జలసిరి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పెన్షన్ దరఖాస్తుల గడువుపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, మున్సిపాలిటీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను వినియోగించుకునేలా ప్రజలకు సూచించాలని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ తదితర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో రూ.5 లక్షల లోపు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, రెండో దశలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఫాంపాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు, సామాజిక ఇంకుడు గుంతలు వంటి నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. రైతులు ఈజీఎస్ ద్వారా నీటి సంరక్షణ పనులు చేపట్టుకునేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులు కూరగాయలు, పప్పుధాన్యాలు, ఆయిల్‌పామ్, నువ్వులు, వేరుశనగ తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. భూగర్భ జలాల పరిస్థితికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ, పీడీ హౌసింగ్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీఏఓ అఫ్జల్ బేగం, హార్టికల్చర్ అధికారి శరత్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన పోషించిన పాత్రను కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రకృతితో కలిసి అభివృద్ధి సాధించాలి

**ఉద్యమ కెరటం, జైనూర్:** విద్యార్థులు ప్రకృతి అందాలను, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా జరిగే అభివృద్ధిని చిత్రాల ద్వారా ప్రతిబింభించాలని విద్యాధికారి కుడిమత మనోహర్ అన్నారు. ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేష్ ఆధ్వర్యంలో సిర్పూర్(యు) మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం "ప్రకృతి, అభివృద్ధి– కలిసి ఎదుగుదాం" అనే అంశంపై ఆర్ట్ కాంపిటీషన్‌కు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన యంగ్ ఇండియా ఫౌండేషన్, అమృత రావు సహకారంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని అడవులు, నదులు, చెరువులు, వన్యప్రాణులు, కొండలు వంటి ప్రకృతి అంశాలతో పాటు రహదారులు, రైల్వేలు, పునరుత్పాదక ఇంధనం, సాగునీటి ప్రాజెక్టులు, పాఠశాలలు, ఆసుపత్రులు, సోలార్ ప్యానెల్స్ వంటి అభివృద్ధి అంశాలను చిత్రాల్లో చూపించాలని వివరించారు. మొక్కలు నాటడం, వర్షపు నీటి సంరక్షణ, సౌరశక్తి వినియోగం, వ్యర్థాలను వేరు చేయడం, పరిశుభ్రమైన ప్రజా ప్రదేశాల నిర్వహణ వంటి అంశాల ద్వారా సుస్థిర అభివృద్ధి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అభివృద్ధి ప్రకృతికి వ్యతిరేకంగా కాకుండా ప్రకృతితో కలిసి కొనసాగాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ అశోక్, సిర్పూర్(యు) పీహెచ్‌సీ డాక్టర్ మేజర్ ఉదయ్ కిరణ్, ఏఎస్సై గంగారాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య ఆహారం అవసరం



**ఉద్యమ కెరటం, జైనూర్:** సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని సీడబ్ల్యూఎస్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ మొబిలైజర్ హెచ్.దిగంబర్ అన్నారు. గురువారం సీడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఎఫ్ఈడబ్ల్యూ మర్సుకోల జగ్జీవన్‌తో కలిసి జైనూర్ మండలంలోని జంగం, సిర్పూర్(యు) మండలంలోని కోహినూర్ గ్రామాల్లో కూరగాయల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఇతర పంటలతో పాటు కుటుంబాలకు పోషకాహారం అందించే కూరగాయలను కూడా సాగు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలకు టమాటా, మిరప తదితర కూరగాయల మొక్కలను అందజేశారు. ఇంటి పరిసరాల్లోనే కూరగాయలను సాగు చేసుకోవడం ద్వారా తాజా, నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా సహజ పద్ధతుల్లో కూరగాయలను పండించి నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

**ఉద్యమ కెరటం, జైనూర్:** రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో గురువారం భారత మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జైనూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రషీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిర్పూర్ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్, డీసీసీ సభ్యుడు పెందోర్ ప్రకాష్, సర్పంచులు రాందాస్, చందంశా, రాస్సిమిట్ట సర్పంచ్ చందు, విఠల్, షేకూ, అబ్బూ, భూపతి, పొలాస ఉప సర్పంచ్ గంగామణి ముఖుందరావు, గోపీచంద్, అజ్జులాలా, దౌలత్ రావు, దత్తు, రహీం, ఇస్లాం, నాగేష్, అజీమ్, కోవా సిద్ధు, దండుగుల మహేష్, క్రిష్ణ,



మార్కెట్ కమిటీ సిబ్బంది, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని నూతన కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణం, సాంకేతిక రంగం, గ్రామీణాభివృద్ధి, ప్రజాస్వామ్య బలోపేతానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా 18 ఏళ్లు నిండిన యువతకు ఫారం-6 ద్వారా నూతన ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అధిక సాంద్రతతో మెరుగైన దిగుబడులు

**ఉద్యమ కెరటం, జైనూర్:** అధిక సాంద్రతతో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి శేఖర్ అన్నారు. కపాస్ కాంతి పథకంలో భాగంగా సిర్పూర్(యు) మండలంలోని రఘూపూర్ గ్రామంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట పరిస్థితిని పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తిలో తెగుళ్లు, పురుగులను ఎప్పటికప్పుడు గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కలుపు నివారణ, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగుమందుల పిచికారీలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. రైతులు పంటను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.



# పటిష్టమైన పోలీసు వ్యవస్థను అమలు చేయాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- వార్షిక తనిఖీల్లో భాగంగా బోథ్ పోలీస్ స్టేషన్ పరిశీలన

**ఉద్యమ కెరటం, బోథ్:** శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన పోలీసు వ్యవస్థను అమలు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం బోథ్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ముందుగా పోలీసు సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించిన ఎస్పీఅనంతరం సిబ్బంది పరేడ్‌ను పరిశీలించారు. ప్రతి వారం పరేడ్ నిర్వహించాలని సూచించారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, రిజిస్టర్లను పరిశీలించిన పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సిబ్బంది విధి నిర్వహణలో యూనిఫాం ధరించాలని తెలిపారు. మండలంలో గంజాయి, పేకాట, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ప్రజా సమస్యలను పోలీస్ స్టేషన్‌లో బాధ్యతగా స్వీకరించి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీసులపై ప్రజల్లో విశ్వాసం, గౌరవం పెరిగేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి.గురుస్వామి, ఎస్సై వి.పురుషోత్తం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, యువత, సాంకేతిక రంగాలకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచులు, వైస్ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కిసాన్ సెల్, ఎస్సీ సెల్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# పతకానికి అడుగు దూరంలో గాయత్రి-ట్రీసా

- జపాన్ జోడీపై వరుస గేముల్లో విజయం
- ప్రపంచ పోటీల్లో క్వార్టర్స్‌కు భారత జోడీ
- 21-16, 21-12తో అదిరిపోయే గెలుపు
- క్వార్టర్స్‌లో చైనా జోడీతో అమీతుమీ
- గెలిస్తే 15 ఏళ్ల తర్వాత చారిత్రక పతకం




**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ సత్తా చాటింది. మహిళల డబుల్స్‌లో అద్భుత ఆటతీరుతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన రెన్ ఇవానగా-కీ నకనిషి జోడీని 21-16, 21-12 తేడాతో వరుస గేముల్లో చిత్తుచేసింది. దీంతో భారత జోడీ పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 39వ స్థానంలో ఉన్న గాయత్రి-ట్రీసా మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ట్రీసా శక్తిమంతమైన జంప్ స్మాష్‌లతో జపాన్ జోడీపై ఒత్తిడి పెంచగా, గాయత్రి నెట్ వద్ద చురుగ్గా కదులుతూ పాయింట్లు సాధించారు. ఇద్దరి మధ్య అద్భుత సమన్వయం, కోర్టులో వేగవంతమైన కదలికలతో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు.

### ఎల్లో కార్డు.. అయినా తగ్గని దూకుడు

మ్యాచ్ మధ్యలో లైన్ కాల్స్ విషయంలో అంపైర్‌తో భారత జోడీకి స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఓ సందర్భంలో షటిల్‌ను ఉద్దేశపూర్వకంగా కొట్టినందుకు ట్రీసాకు ఎల్లో కార్డు చూపించారు. అయినప్పటికీ ఏకాగ్రత కోల్పోకుండా కోచ్ పుల్లెల గోపీచంద్ సూచనలతో ఇద్దరూ తిరిగి ఆటపై దృష్టి పెట్టి విజయాన్ని ఖాయం చేసుకున్నారు.

### చైనాతో అసలు సిసలు పోరు

క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రీసాకు అసలైన పరీక్ష ఎదురుకానుంది. ప్రపంచ నాలుగో ర్యాంకు చైనా జోడీ జియా యి ఫాన్-జాంగ్ షు షియాన్‌తో తలపడనున్నారు. ఇప్పటివరకు ఈ జోడీతో మూడుసార్లు తలపడిన భారత ద్వయం ఒక్కసారి కూడా విజయం సాధించలేదు. అయితే ప్రస్తుతం ఉన్న జోరును కొనసాగించి చైనా జోడీని ఓడిస్తే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకం ఖాయం కానుంది. భారత మహిళల డబుల్స్‌లో చివరిసారిగా 2011లో జ్వాలా గుత్తా-అశ్విని పొన్నప్ప ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించారు. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రీసా విజయం సాధిస్తే 15 ఏళ్ల తర్వాత ఆ ఘనతను అందుకోవడంతో పాటు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన రెండో భారత మహిళల డబుల్స్ జోడీగా చరిత్ర సృష్టించనున్నారు.




# సింధు ముందుకు.. సేన్ ఇంటికి

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, యువ సంచలనం ఆయుష్ శెట్టి ప్రిక్వార్టర్స్ చేరగా.. టైటిల్ ఫేవరెట్ లక్ష్య సేన్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 9వ సీడ్ సింధు 21-16, 21-17తో కెనడాకు చెందిన వెన్ యు జాంగ్‌పై వరుస గేమ్స్‌లో విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో తను చైనా స్టార్, మూడో సీడ్ వాంగ్ జి యితో అమీతుమీ తేల్చుకోనుంది. తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆడుతున్న యువ షట్లర్ ఉన్నతి హుడా 21-11, 9-21, 21-23తో 12వ సీడ్ మిచెల్ లీ (కెనడా) చేతిలో పోరాడి ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో లక్ష్యకు అమెరికా షట్లర్ గారెట్ టాన్ షాకిచ్చాడు. 67 నిమిషాల పాటు సాగిన పోరులో లక్ష్య 21-19, 19-21, 17-21తో ఓటమి పాలయ్యాడు. ఇక పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో గాయం కారణంగా ప్రత్యర్థులు వాకోవర్ ఇవ్వడంతో భారత స్టార్ జోడీ సాత్విక్- చిరాగ్ శెట్టి నేరుగా ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. మరోమ్యాచ్‌లో హరిహరన్-ఎంఆర్ అర్జున్ 17-21, 14-21తో కాంగ్ మిన్ హ్యూక్ - కీ డాంగ్ జూ (కొరియా) చేతిలో ఓడగా.. మిక్స్‌డ్ లో తనీషా క్రాస్టో- ధ్రువ్ కపిల 21-11, 21-11తో లియాంగ్ చోంగ్-వెంగ్ చీ (మకావు)పై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరింది.

# లంకకు ట్రిపుల్ షాక్..

## భారత్‌కు విజయం మరింత ఈజీ!

- రెండో టెస్టుకు ముగ్గురు కీలక ఆటగాళ్లు దూరం
- చండిమాల్, మెండిస్, నిస్సాంకకు గాయాలు
- తొలి టెస్టులో 165 పరుగులతో భారత్ ఘనవిజయం
- ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో సమరం
- యువ ఆటగాళ్లకు ఇదే అవకాశమన్న కిర్‌స్టెన్




**కొలంబో:** తొలి టెస్టులో భారత్ చేతిలో భారీ ఓటమి ఎదుర్కొన్న శ్రీలంకకు రెండో టెస్టుకు ముందు వరుస షాక్‌లు తగిలాయి. కీలక ఆటగాళ్లు దినేష్ చండిమాల్, కుశాల్ మెండిస్, పాథుమ్ నిస్సాంక గాయాల కారణంగా రెండో టెస్టుకు దూరం కానున్నారు. ఇప్పటికే గాలెలో జరిగిన తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఓడిన లంకకు ముగ్గురు ప్రధాన ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఆగస్టు 23 నుంచి కొలంబో వేదికగా రెండో టెస్టు జరగనుంది. కుశాల్ మెండిస్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడుతున్నాడని శ్రీలంక ప్రధాన కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ వెల్లడించారు. గాయం తీవ్రత కారణంగా కొన్ని రోజుల పాటు అతడు జట్టుకు అందుబాటులో ఉ ండడని తెలిపారు. ఓపెనర్ పాథుమ్ నిస్సాంక కూడా తొడ కండరాల గాయంతో రెండో టెస్టుకు దూరమయ్యాడు.

### చండిమాల్‌కూ విశ్రాంతి

తొలి టెస్టులో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దినేష్ చండిమాల్ గాయపడ్డాడు. తల, మెడ భాగంలో గాయం కావడంతో మైదానంలోనే అస్వస్థతకు గురైన అతడిని ఆస్పత్రికి తరలించారు. అతడి స్థానంలో పాసిందూ సూర్యబండార కంకషన్ ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగాడు. వైద్యుల సూచనల మేరకు చండిమాల్‌ను రెండో టెస్టు నుంచి తప్పించినట్లు శ్రీలంక జట్టు వర్గాలు తెలిపాయి.

### యువ ఆటగాళ్లకు పరీక్ష

ముగ్గురు సీనియర్ ఆటగాళ్లు దూరం కావడం యువ క్రికెటర్లకు తమ సత్తా నిరూపించుకునే అవకాశమని కిర్‌స్టెన్ అభిప్రాయపడ్డారు. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు జాతీయ జట్టులో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. శ్రీలంకలో ప్రతిభకు కొదవలేదని, అయితే టెస్టు క్రికెట్‌లో మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. గాలె టెస్టులో 99 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినా మ్యాచ్‌ను ఐదో రోజు వరకు తీసుకెళ్లడం జట్టు పోరాట పటిమకు నిదర్శనమన్నారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ టాప్ ఆర్డర్ విఫలం కావడమే ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషించారు. యువ బ్యాటర్ సోనల్ దినూష తొలి ఇన్నింగ్స్‌లో 100, రెండో ఇన్నింగ్స్‌లో 84 పరుగులతో ఆకట్టుకున్నాడని ప్రశంసించారు. తొలి టెస్టు విజయంతో ఇప్పటికే ఉత్సాహంగా ఉన్న భారత్‌కు.. శ్రీలంక కీలక ఆటగాళ్లు ముగ్గురు దూరం కావడం మరింత కలిసొచ్చే అంశం. దీంతో కొలంబో టెస్టులోనూ భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.



# అగ్రస్థానంలోకి ప్రజ్ఞానంద

**సెయింట్ లూయిస్ :** సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద టైటిల్‌కు చేరువయ్యాడు. బుధవారం జరిగిన ఎనిమిదోరౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్ లాగ్రెవ్‌ను ఓడించిన ప్రజ్ఞా.. అమెరికా జీఎం వెస్లీ సోతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. నల్లపావులతో ఆడిన ప్రజ్ఞా తెలివైన వ్యూహంతో 28 ఎత్తుల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించాడు. ఈ విజయంతో 5 పాయింట్లు సాధించిన భారత గ్రాండ్ మాస్టర్ ఈ ఏడాది చివర్లో జరిగే ఫైనల్ బెర్తు ఖాయం చేసుకున్నాడు. ఆఖరి రౌండ్‌లో ప్రజ్ఞానంద తెల్ల పావులతో నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరితో తలపడనున్నాడు.

# పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్

హాకీ వరల్డ్ కప్‌లో టాప్-8కి దూసుకెళ్లిన టీమిండియా



**అమ్స్టెల్వీన్:** నెదర్లాండ్స్‌లోని అమ్స్టెల్వీన్ వేదికగా జరుగుతున్న హాకీ వరల్డ్ కప్ 2026 పూల్-డీ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన పోరులో భారత్ 5-3 తేడాతో ఘన విజయం సాధించి టోర్నీలో టాప్-8 స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఇంగ్లండ్ చేతిలో ఎదురైన పరాజయం తర్వాత అద్భుతంగా పుంజుకున్న భారత జట్టు, ప్రపంచకప్‌లో తమ అవకాశాలను సజీవంగా ఉంచుకుంటూ ఈ కీలక విజయాన్ని అందుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు మ్యాచ్ ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ 20వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి జట్టుకు 3-0 ఆధిక్యాన్ని అందించాడు. వెంటనే 21వ నిమిషంలో పాకిస్థాన్ ఆటగాడు షాహిద్ హన్నన్ గోల్ చేయడంతో స్కోరు 3-1 అయింది. అయితే 23వ నిమిషంలో భారత ఆటగాడు అభిషేక్ మెరుపు గోల్‌తో స్పందించి స్కోరును 4-1కి తీసుకెళ్లాడు. తర్వాతి నిమిషంలోనే పాకిస్థాన్ తరఫున సుఫ్యాన్ ఖాన్ మరో గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 4-2 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లోనూ భారత్ తన దూకుడును కొనసాగించింది. లభించిన పెనాల్టీ అవకాశాన్ని హార్దిక్ సింగ్ సమర్థవంతంగా గోల్‌గా మలచడంతో భారత్ 5-2 ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి క్వార్టర్ 45వ నిమిషంలో పాకిస్థాన్ ప్లేయర్ షాహిద్ హన్నన్ తన రెండో గోల్ సాధించి స్కోరును 5-3కి తీసుకొచ్చినా, చివరి నిమిషాల్లో భారత డిఫెన్స్ అత్యంత పటిష్టంగా వ్యవహరించింది. ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను నియంత్రించి 5-3తో చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (2 గోల్స్), అభిషేక్ (2 గోల్స్), హార్దిక్ సింగ్ (1 గోల్) రాణించడంతో భారత్ ప్రపంచకప్ తదుపరి దశకు సముచిత రీతిలో అడుగుపెట్టింది.




# సుహాస్ ప్రీతమ్‌కు స్వర్ణం

**హైదరాబాద్:** జూనియర్ నేషనల్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు 4 పతకాలు సాధించారు. భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన బాయ్స్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో చెందిన సుహాస్ ప్రీతమ్ స్వర్ణం నెగ్గాడు. ఫైనల్ రేసును 57.33 సెకండ్ల కెరీర్ బెస్ట్ టైమింగ్‌తో ముగించి అగ్రస్థానం సొంతం చేసుకున్నాడు. శ్రీనిత్య సాగి బాలికల 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే విభాగంలో 5 నిమిషాల 19.15 సెకండ్లతో రజతం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ రేసులో (1:08.37 ని) కాంస్యం గెలిచింది. అనికా దెబోరా బాలికల 50 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో (28.02 సె) మూడో స్థానంతో కాంస్యం ఖాతాలో వేసుకుంది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 ఆగస్టు 2026




# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.

# మరో మూవీతో మమితా బైజు సిద్ధం

'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.



# పూజా హెగ్డేకు అరుదైన గౌరవం

## న్యూయార్క్‌లో ప్రత్యేక సత్కారం

## అంతర్జాతీయ వేదికపై మెరిసిన నటి

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక పూజా హెగ్డేకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. న్యూయార్క్‌లో జరిగిన ప్రత్యేక గాలా కార్యక్రమంలో ఆమెను సత్కరించారు. ఈ గౌరవంపై ఉప్పొంగిపోయిన పూజా హెగ్డే సామాజిక మాధ్యమాల వేదికగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. న్యూయార్క్‌లో నిర్వహించిన గాలా కార్యక్రమానికి హాజరైన పూజా హెగ్డేకు అక్కడ ప్రత్యేక సత్కారం లభించింది. తనను గౌరవించిన న్యూయార్క్ నగర పబ్లిక్ అడ్వకేట్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై దక్కిన ఈ గుర్తింపు తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

### 'ఇది ఆరంభం మాత్రమే'

"ఈ గౌరవం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. నన్ను సత్కరించిన న్యూయార్క్ నగర పబ్లిక్ అడ్వకేట్‌కు, నిర్వాహకులకు కృతజ్ఞతలు. ఇంతటి ప్రేమను అందుకున్న తర్వాత మళ్లీ పని బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది ఆరంభం మాత్రమే.. మున్ముందు ఇంకా చాలా ఉంది" అంటూ పూజా హెగ్డే తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. దక్షిణాది చిత్రసీమలో పలువురు అగ్ర కథానాయకుల సరసన నటించి అగ్ర కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే ఇటీవల 'జన నాయకుడు' చిత్రంలో కథానాయికగా మెరిశారు. ప్రస్తుతం ఆమె 'కాంచన 4', 'శ్రీ శ్రీ' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. అంతర్జాతీయ వేదికపై తాజాగా లభించిన సత్కారంతో పూజా మరోసారి వార్తల్లో నిలిచారు.



# మ్యూజికల్ డ్రామా జగమే సంగీతం




## అమెజాన్‌లో 4నుంచి వెబ్ సిరీస్

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల

'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెల్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**